మిల్లుల వద్ద సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు పని చేయాలి

- కర్నూలులో వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ ప్రారంభం - రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ మోహన్

ప్రజాశక్తి-కర్నూలు లీగల్

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో ప్రజలకు సత్వర న్యాయం అందించేలా వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ పని చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కర్నూలు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ పేర్కొన్నారు. శనివారం కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్‌ను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కర్నూలు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చారిత్రక ప్రాముఖ్యత కలిగిన కర్నూలులో రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే కర్నూలులో లోకాయుక్త, హ్యూమన్ రైట్స్ కమిషన్, ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ వంటి సంస్థలు ఏర్పాటయ్యాయని తెలిపారు. వీటికి అదనంగా అవసరంలో ఉన్న ప్రజలకు న్యాయం చేసేందుకు వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ కూడా చేరిందన్నారు. కేసుల పరిష్కారంలో ట్రిబ్యునల్, సభ్యులకు బార్ మెంబర్స్ తగిన సహకారం అందించాలని కోరారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, సంబంధిత అంశాల్లో సమర్థవంతంగా న్యాయం అందించాలన్నదే వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ అంతిమ లక్ష్యమని తెలిపారు. అందరి సహకారంతో ఈ లక్ష్యాన్ని సాధించాలని కోరారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... కర్నూలులో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయాన్ని, లోకాయుక్తను ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ కోర్టు ఏర్పాటయినందుకు జిల్లావాసిగా సంతోషిస్తున్నానని చెప్పారు. రాష్ట్ర విభజన జరిగిన తొమ్మిదేళ్ల తర్వాత రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ కోర్టు ఏర్పాటు కావడం గొప్ప విషయమన్నారు. న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి వెన్నెముక అని, ఇక్కడే వివాదాలు పరిష్కరించబడతాయని తెలిపారు. కోర్టులకు మౌలిక సదుపాయాల విషయంలో గతంలో కంటే మెరుగ్గా ఉన్నామని చెప్పారు. ప్రస్తుతం టెక్నాలజీ బాగా పెరిగిందని, న్యాయవాదులు ఈ టెక్నాలజీని బాగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. న్యాయ సంబంధిత అన్ని అంశాల్లో బార్, బెంచ్ సమన్వయంతో పని చేయాలని సూచించారు. కర్నూలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి ఎన్.శ్రీనివాస రావు మాట్లాడుతూ... రాష్ట్ర విభజన తర్వాత సెక్షన్ 83(1) ప్రకారం జిఒ నెంబర్ 16 జారీ చేస్తూ కర్నూలు జిల్లాలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ కోర్టును ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ట్రిబ్యునల్‌లో రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ జి.భూపాల్ రెడ్డి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారని, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ మెంబర్‌గా నాగేశ్వరరావు, అబ్దుల్ మజీద్ వ్యవ హరిస్తారని చెప్పారు. మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎఎమ్‌డి.ఇంతియాజ్ మాట్లాడుతూ... వక్ఫ్ అనేది ముస్లిం చట్టం ద్వారా గుర్తించిన మతపరమైన, పవిత్రమైన ధార్మిక ప్రయోజనాల కోసం కదిలే లేదా స్థిరాస్తి అని తెలిపారు. వక్ఫ్ ఆదాయాన్ని విద్య, అభివృద్ధి, సంక్షేమం, ముస్లిం చట్టం ద్వారా గుర్తించిన ప్రయోజనాల కోసం ఖర్చు చేయాలని పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ ఛైర్మన్ జి.భూపాల్ రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి/సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్.వెంకట నాగ శ్రీనివాస రావు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ సభ్యులు హబీజ్ డాక్టర్ అబ్దుల్ మస్జిద్, డిఆర్‌ఒ ఎస్‌వి.నాగేశ్వరరావు, ఫ్యామిలీ కోర్టు జడ్జి ప్రతిభా దేవి, జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కల్యాణి, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.నాగభూషణం నాయుడు, చక్రపాణి సీనియర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ మోహన్

హమాలీలకు సంక్షేమ
బోర్డు ఏర్పాటు చేయాలి

- సిఐటియు నగర అధ్యక్షులు నరసింహులు
- కార్మికులతో సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

రైస్ మిల్ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. కర్నూలు న్యూ సిటీ హమాలీ కార్మికుల ఫెడరేషన్ కమిటీ ఆధ్వర్యంలో మారుతి రైస్ మిల్, రంగ పుల్లారెడ్డి రైస్ మిల్, ట్రిపుల్ కె రైస్ మిల్, యునైటెడ్ రైస్ మిల్ హమాలీ కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. రైస్ మిల్ యూనియన్ నగర కోశాధికారి ఎస్.ఉస్మాన్ బాష అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన నరసింహులు, న్యూ సిటీ రైస్‌మిల్ హమాలీ కార్మిక సంఘం అధ్యక్షులు సిహెచ్.సాయిబాబా మాట్లాడారు. హమాలీ కార్మికులు మూటలు మోస్తూ, చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించు కుంటూ, పిల్లలను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పని ప్రదేశంలో సరైన వసతుల్లేక, ప్రమాదం జరిగినా, గాయాలపాలైనా, ప్రమాదవ శాత్తు మరణించినా కార్మికుల కుటుంబాలను పట్టించుకునే నాథుడే లేడన్నారు. రోజూ మూటలు మోసి, మోకాళ్లు, నడుము, మెడ దగ్గర ఎముకలు అరిగి 50 ఏళ్ల వయస్సు రాకముందే మూటలు మోయలేక, పని చేయలేక, అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. వయస్సు రాకముందే వృద్ధుల్లాగా ఇంటి దగ్గరే ఉండి కుటుంబానికి భారంగా మారిన పరిస్థితి ఉందని చెప్పారు. హమాలీ కార్మికుల సమస్యలను కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ గోడౌన్లను పనికి రాని గోడౌన్లుగా చేసి, ప్రయివేట్ గోడౌన్లకు అవకాశం కల్పించి, ప్రభుత్వ గోడౌన్లలో పని చేసే కార్మికులకు పని లేకుండా చేయాలనే దుర్మార్గమైన ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 44 లేబర్ కోడ్లను కుదించి 4 లేబర్ కోడ్లుగా చేసి యజమానులకు అనుకూలంగా చేయడం దారుణమన్నారు. హమాలీ కార్మికుల సంక్షేమం కోసం సిఐటియు హమాలీ కార్మికుల రాష్ట్ర ఫెడరేషన్ ఏర్పాటు చేసి వారి హక్కుల కోసం ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమయిందని తెలిపారు. హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈఎస్‌ఐ, పిఎఫ్, పెన్షన్, పని భద్రత, బీమా సౌకర్యం, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 44 లేబర్ కోడ్లను యథావిధిగా కొనసాగించాలని దశలవారీ పోరాటాలకు హమాలీ కార్మిక ఫెడరేషన్ పిలుపునిచ్చిందని తెలిపారు. హమాలీ కార్మికులతో సంతకాలు సేకరించి ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, మంత్రులకు, హమాలీ కార్మికుల డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ పోరాటంలో రైస్ మిల్ హమాలీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రైస్‌మిల్ హమాలీ కార్మికుల మేస్త్రీలు కె.శేఖర్, కె.సుంకన్న, కె.హనుమంతు, ఎర్రమల, మద్దిలేటి పాల్గొన్నారు.

ఉర్దూ వర్సిటీని పరిశీలిస్తున్న రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇంతియాజ్

వర్సిటీ అభివృద్ధికి కృషి

- మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇంతియాజ్ తెలిపారు. శనివారం నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని సందర్శించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.ఫజులుర్ రహమాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ శాఖ కార్యదర్శి యూనివర్సిటీ అభివృద్ధికి సంబంధించిన అంశాలు, సమస్యలు, తదితర విషయాలను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.ఫజులుర్ రహమాన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఓర్వకల్లులోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ శాశ్వత భవనాల నిర్మాణం, యూనివర్సిటీ తాత్కాలిక వసతి కోసం ప్రభుత్వ భవనం కేటాయింపు, రెగ్యులర్ పోస్టుల మంజూరు, యూనివర్సిటీ మెయింటెనెన్సు గ్రాంట్ మంజూరుకు ఉన్నత విద్యా శాఖ, ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి, మంజూరు చేసేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

ఉప పోరు వైసిపిదే...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా గత శనివారం నిర్వహించిన గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో వైసిపి విజయకేతనం ఎగురవేసింది. వివిధ కారణాలతో ఖాళీ ఏర్పడిన స్థానాలకు నిర్వహించిన ఎన్నికలు ప్రధాన ఎన్నికలను తలపించాయి. కర్నూలు జిల్లాలో ఒక సర్పంచి, 42 వార్డు స్థానాలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో 27 వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా ఒక సర్పంచి, 15 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. కర్నూలు జిల్లాలో ఒక సర్పంచి, 42 వార్డు స్థానాలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో 27 వార్డు స్థానాలు ఏకగ్రీవం కావడంతో శనివారం 15 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఒక సర్పంచి, 9 వార్డు స్థానాల్లో వైసిపి బలపరచిన అభ్యర్థులు విజయం సాధించగా 6 స్థానాల్లో టిడిపి బలపరచిన అభ్యర్థులు విజయం సాధించారు. కౌతాళం మండలం బదినేహాలు గ్రామంలో వైసిపి, టిడిపి మధ్య గట్టి పోటీ నెలకొంది. ఇరు పార్టీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ పోటీలో వైసిపి బలపరచిన అభ్యర్థి టిడిపి బపరచిన అభ్యర్థిపై 323 ఓట్లతో గెలుపొందారు.

సాగని సాగు...

ఈఏడాది సంపూర్ణ వర్షాలు కురవక ఖరీఫ్ సీజన్ ప్రశ్నార్థకంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో ఆలస్యంగా వర్షాలు వచ్చినా ఆశాజనకంగా పంటల సాగు లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత జులై నెలలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారి కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో రైతన్న కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. ఆ ఆనందం పట్టుమని 30 రోజులు కాకముందే రైతుకు కన్నీరుగా మారింది. ఆగస్టు నెలలో అక్కడక్కడ చదురుముదురు చినుకులు వస్తున్నా పంటకు కావాల్సి వర్షం కురవడం లేదు. పైరులు సంపూర్ణంగా తడవడం లేదు.

జలాశయాలకు తగ్గిన వరద...

జిల్లాలో జలాశయాలకు వరద నీటి ప్రవాహం తగ్గుతోంది. శ్రీశైలం జలాశయానికి చుక్క నీరు కూడా పైనుంచి వచ్చి చేరడం లేదు. కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి కూడా వరద నీటి ప్రవాహం స్వల్పంగా ఉంది. ఎగువన వర్షాలు కురవకపోవడంతో ఇన్‌ఫ్లో చాలా తక్కువగా ఉంటోంది.

అవీ..ఇవీ..అన్నీ...

గూడూరు మండలం పెంచికలపాడు, కె.నాగలాపురం గ్రామాల మధ్య ఉన్న చెరువు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు కర్నూలు ఆర్‌డిఒ హరిప్రసాద్‌ను గౌస్‌దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ కలిసి వినతి పత్రం సమర్పించారు. గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆదోని పట్టణానికి తాగునీరందించే బసాపురం ట్యాంకు నిర్మాణంలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి, కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. వారు ట్యాంకు దుస్థితిని పరిశీలించారు. డిఎస్‌సి 98 క్వాలిఫైడ్ అభ్యర్థులు కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో భిక్షాటన చేపడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- డిఇఒ రంగారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రతి ఉపాధ్యాయుడూ కృషి చేయాలని డిఇఒ రంగారెడ్డి ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారి భవిష్యత్తుకు పునాది వేయాలని కోరారు. ప్రభుత్వం అందించిన ట్యాబ్ ఉపయోగాలు, ఉపాధ్యాయుల బోధన సరళి వంటి అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు చేయాలని, పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎంఇఒలు మోహినుద్దీన్, రాఘన్న, ప్రధానోపాధ్యాయులు హంపయ్య, ఉపాధ్యాయులు విఠోబరావు, రామన్న, వీరేష్, పీడీ బసవరాజు, పిఇటి నరసింహరాజు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ రంగారెడ్డి

నాటకప్రదర్శనలో ఓ సన్నివేశం

సీమలో వెనుకబడిన నాటకరంగం : వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

రాయలసీమలో సాంఘిక నాటక రంగం వెనుకబడి ఉందని, అందుకే సినీరంగంలో రాయలసీమ కళాకారుల సంఖ్య చాలా తక్కువ ఉందని పలువురు వక్తలు తెలిపారు. శనివారం రాత్రి కర్నూలు నగరంలోని టీజీవి కళాక్షేత్రంలో రెండవ రోజు సాంఘిక నాటక ప్రదర్శనలు జరిగాయి. మొదట వైకె నాగేశ్వరరావు చిత్రపటానికి పుష్పమాలను సమర్పించి జ్యోతి ప్రజ్వలనను జిల్లా ప్రముఖులు చేశారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, విశ్రాంత జిల్లా కలెక్టర్ గుమ్మల్ల బలరామయ్య, ప్రజానాట్యమండలి వేదిక కన్వీనర్ డాక్టర్ శాంతారామ్, కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియా, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సినీ నటులు స్మారక పురస్కారాన్ని మరో సినీనటులు వైఎస్ కృష్ణేశ్వరరావుకు అందజేశారు. అనంతరం జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ కళావిపంచి టిజివి కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. సాంఘిక నాటక రంగానికి కర్నూలు జిల్లా ప్రజలు చేయూతనివ్వాలని, ప్రస్తుత సమాజంలోని సమస్యలకు పరిష్కారం చూపుతుందని తెలిపారు. త్వరలో యువకులకు శిక్షణ ఇచ్చి డాక్టర్ శాంతారాం సహకారంతో ఒక అకాడమీ ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థి కార్యక్రమాలు నాటక శిక్షణ ఇవ్వటానికి కృషి చేస్తామని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. యువకులు నాటక రంగం పట్ల ఆకర్షితులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మొదటి ప్రదర్శనగా రసజారి పొన్నూరు వారి త్రిజుడు వైఎస్ కృష్ణేశ్వరావు దర్శకత్వంలో లహరి అమృత వర్షిని తదితర నట బృందం హృదయ పూర్వకంగా ప్రేక్షకులను ఆకర్షితులను చేశారు. రెండోనాటికగా చెరుకూరి సాంబశివరావు దర్శకత్వంలో కాట్రపాడు కళాకారులు ప్రక్షాళన నాటికను ప్రదర్శించారు.

జై భీమ్‌కు అవార్డు రాకపోవడం సిగ్గుచేటు

- జై భీమ్ ఆర్గనైజేషన్ సభ్యులు

ప్రజాశక్తి - మద్దికేర : జై భీమ్ సినిమాకు అవార్డు రాకపోవడం సిగ్గుచేటని జై భీమ్ ఆర్గనైజేషన్ సభ్యులు తీవ్రంగా విమర్శించారు. శనివారం మద్దికెరలో మండల అధ్యక్షుడు గద్దల రాజు మాట్లాడుతూ సామాజిక, చైతన్య నేపథ్యంగా తెలుగు తెరకెక్కిన జై భీమ్ సినిమాను జాతీయస్థాయిలో గుర్తించకపోవడం చాలా అవమానకరం, బాధాకరమన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రామాంజనేయులు సలహాదారుడు గద్దల చిన్న, పట్టణ అధ్యక్షుడు రత్నమయ్య, రాము, సభ్యులు పాల్గొన్నారు.

టమోటా ధర పతనం

25 కేజీల టమోటా బాక్స్ రూ. 1200 నుంచి రూ. 325
- 15 రోజుల వ్యవధిలోనే భారీగా తగ్గిన ధర - ఆందోళనలో రైతులు
- వచ్చిన ఆదాయం ఖర్చులకే సరిపోతుందంటున్న వైనం

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌లో టమోటా ధర శనివారం పూర్తిగా పతనమైంది. గత 15 రోజుల క్రితం 25 కేజీల బాక్స్ టమోటా రూ. 1200 పలకగా నేడు రూ. 325లకే వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 15 రోజుల్లో ధర భారీగా తగ్గిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పంటకు వచ్చిన డబ్బు రవాణా, కూలీల కోతలకు, కమీషన్లకే సరిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తికొండ రెవిన్యూ డివిజన్ పరిధిలోని దేవనకొండ, తుగ్గలి, మద్దికెర, పత్తికొండ మండలాల్లోని గ్రామీణ ప్రాంతాలలో రైతులు టమోటా పంటను అధికంగా సాగు చేస్తారు. మే, జూన్, జులై మాసంలో టమోటా ధరకు రెక్కలు రావడంతో టమోటా రైతులు సాగు చేయడానికి మక్కువ చూపారు. రాష్ట్రంలో మదనపల్లి తర్వాత పత్తికొండ ప్రాంతంలోనే టమోటా పంటను ఎక్కువగా సాగు చేస్తారు. గత సంవత్సరం తుగ్గలి మండలంలో 2489 ఎకరాలు, మద్దికెర మండలంలో 196, దేవనకొండ మండలంలో 1242, పత్తికొండ మండలంలో 2734 ఎకరాలలో టమోటా పంటను సాగు చేశారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ నుంచి వర్షాలు లేకపోవడంతో అరకొరగా టమోటా పంటను సాగు చేశారు. దేవనకొండ మండలంలో 520 ఎకరాలు , పత్తికొండ మండలంలో 960, మద్దికెర మండలంలో 269, తుగ్గలి మండలంలో 1180 ఎకరాలలో టమోటాను రైతులు సాగు చేశారు. హంద్రీనీవా కాలువ కింద కొందరు, బోర్లు ఆధారంగా మరి కొందరు రైతులు టమోటా పంట వేశారు. ఆగస్టు మొదటి వారంలో 24 కిలో బాక్స్ 1200 రూపాయలు ధర పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఆ తర్వాత నుండి రోజురోజుకు టమోటా ధర

పతనం కావడంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. పత్తికొండ వ్యవసాయ మార్కెట్లో టమోటా పంటను కొనుగోలు ప్రారంభించారు. రోజుకు 80 క్వింటాళ్ల దాకా టమోటా పంట వస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. శనివారం మార్కెట్లో టమోటా ధర పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జత బాక్స్ 50 కిలోల టమోటా రూ.650, రూ.550, రూ.400 ప్రకారం, జత గంప రూ.370, రూ.250, రూ.150 ప్రకారం ఇష్టం వచ్చిన రీతిలో వ్యాపారస్తులు కొనడంతో రైతులు ఏమీ చేయాలో తోచక అయోమయంలో పడ్డారు. పంట సాగు చేయడానికి పెట్టిన పెట్టుబడులు, రవాణా చార్జీలు, కూలీలు గిట్టుబాటు ధర కావడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో 50 రూపాయలు పలుకుతున్నాయి. వ్యాపారస్తులు మాత్రం పత్తికొండ మార్కెట్ నుంచి తక్కువ ధరకు కొని తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక సుదూర ప్రాంతాలకు టమోటాలను ఎగుమతి చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు టమోటా మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించి గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి కూడా రావడం లేదు..

రెండు ఎకరాలలో టమోటా పంటను సాగు చేశాను. 60 వేల రూపాయలు పెట్టుబడి పెట్టాను. ఆగస్టు మొదటి వారంలో టమోటా ధర 1500 రూపాయలు ఉంది. 15 రోజులకే టమోటా ధర అమాంతంగా పడిపోయింది. 20 గంపలు మార్కెట్‌కు తీసుకొచ్చాను. జత గంపలు 370 రూపాయల లెక్కన కొనుగోలు చేశారు. గంపకు 10 రూపాయలు కూలి చెల్లించాను. పెట్టిన పెట్టుబడి కూడా వస్తుందో లేదో అర్థకం కావడం లేదు.

- హనుమప్ప, రైతు, కురువలదొడ్డి గ్రామం, పత్తికొండ మండలం.

100కి 10 కమీషన్ తీసుకోవడం అన్యాయం

పత్తికొండ వ్యవసాయ మార్కెట్లో వ్యాపారస్తులు 100కి 10 రూపాయలు కమీషన్ తీసుకోవడం అన్యాయం. వేలకు వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటను పండించాను. మార్కెట్‌కి టమోటాను తీసుకువస్తే 25 కేజీలు చొప్పున జత బాక్స్ రూ. 650లతో కొనుగోలు చేశారు. టమోటాకు వచ్చిన డబ్బు రవాణా చార్జి, కూలీ ఛార్జి, పెట్టుబడులు కమీషన్లకే సరిపోతుంది. మాకు మిగిలేది ఏమీ లేదు.

- నాగేంద్ర నాయక్, రైతు, లక్ష్మీ తండా గ్రామం, తుగ్గలి మండలం.

రాజకీయాలు తప్ప కబ్జాలు తెలియవు : టిడిపి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్ : టిడిపి కర్నూలు నియోజకవర్గ సీనియర్ నాయకులు డి విష్ణువర్ధన్ రెడ్డికి రాజకీయాలు తప్ప కబ్జాలు తెలియవని టిడిపి కోడుమూరు నియోజకవర్గ యువ నాయకులు బొగ్గుల దస్తగిరి అన్నారు. గార్గేయపురం చెరువు విషయంలో ఓ పత్రిక రాసిన కథనాల్ని ఖండిస్తూ శనివారం ఆయన ప్రకటనను విడుదల చేశారు. ఆయన తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక్క సెంటు భూమిని కూడా కబ్జా చేయలేదన్నారు. కాదని నిరూపించే సత్తా అధికార పక్షానికి ఉందా అని ప్రశ్నించారు. కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అధికార పార్టీకి వంతపాడే పత్రికలో తప్పుడు రాతలు రాయిస్తూ సునకానందం పొందుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేనే ఇసుక, మద్యం అక్రమ వ్యాపారంతో పాటు భూ కబ్జాలకు పాల్పడుతూ అక్రమంగా ఆస్తులు సంపాదించారన్నారు. అందుకు ఆయన నిర్మించుకున్న రూ.కోట్ల విలువచేసే భవంతే నిదర్శనమన్నారు. చెరువు సర్వే నెంబరు, మిలిటరీ పట్టాల సర్వే నెంబరు వేరువేరుగా ఉన్నాయన్నారు. ఆ భూములను కబ్జా చేయలేదని, వాటిని డబ్బులు ఇచ్చి కొనుగోలు చేశారన్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తించాలన్నారు. కబ్జాలకు, కొనుగోలుకు తేడా తెలుసుకోవాలన్నారు. అడ్డదిడ్డ వ్యాఖ్యలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

క్రీడాకారులతో ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ

అతి ప్రాచీన క్రీడ సిలంబం

- ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

సిలంబం ప్రాచీన నాటి విద్య కళ అని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. శనివారం కర్నూల్ డిఎస్‌సి అవుట్డోర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సిలంబం క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడను ప్రాచీన నాటి కాలం నుండి ఎంతో ఎంతోమంది పూర్వీకులు అభ్యసించేవారని తెలిపారు. ఆత్మరక్షణకు, ధృఢత్వానికి ఈ క్రీడ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ విద్య నేర్చుకోవడం వల్ల చదువుతోపాటు పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ఈ పోటీల్లో 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిలంబం శిక్షకుడు పి రాఘవేంద్ర, మహావీర్, గోపి, సాయినాథ్, సతీష్ కుమార్, ఝాన్సీ బహదూర్, శంకర్, సత్యనారాయణ, పిడి ఎమ్మిగనూరు నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రవీంద్ర విద్యార్థులు సాయం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మదర్ థెరిసా జయంతి పురస్కరించుకొని నగర శివారులోని శిరిడి సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు రవీంద్ర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బియ్యం, బ్రెడ్ ప్యాకెట్లు అందజేశారు. ఎన్ఎస్ఎస్ విభాగానికి చెందిన విద్యార్థులు ఇలాంటి సేవా కార్యక్రమంలో పాల్గొనడం పట్ల కళాశాల చైర్మన్ కుమార్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పాండురంగయ్య, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తిలు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింతగా కొనసాగించాలని కోరారు.

వృద్ధులకు సాయం చేస్తున్న రవీంద్ర కళాశాల విద్యార్థులు

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

సర్వసభ్య సమావేశంలో
నిలబడి మాట్లాడితే పనులు చేయం

- మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి-ఆలూరు

ప్రతిపక్ష ఎంపిటిసిగా ఉంటూ సర్వసభ్య సమావేశంలో లేచి నిలబడి మాట్లాడితే పనులు చేయబోమని ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. ఆయన మాట్లాడిన మాటలు అందరినీ విస్మయానికి గురి చేసింది. శనివారం మండల పరిషత్ హాలులో ఎంపిపి రంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తుంబలబీడు ఎంపిటిసి రమేష్ మాట్లాడారు. ఎంపిటిసిలుగా గెలిచినప్పటి నుంచి ఒక్క పైసా కూడా అభివృద్ధి పనులకు కేటాయించలేదన్నారు. తాము ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయామే తప్ప అభివృద్ధి పనులు చేయలేపోయామని తెలిపారు. స్పందించిన నారాయణ మాట్లాడుతూ... సమావేశంలో అడిగినంత మాత్రాన అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వబోమన్నారు. తమ సర్పంచులు, పార్టీ నాయకులు అభివృద్ధి చేస్తారని చెప్పారు. ఏదైనా పని చేయించుకోవాలంటే సమావేశంలో మాట్లాడకుండా అధికారులు, మండల నాయకులతో మాట్లాడి పనులు చేయించుకోవాలన్నారు. చంద్రబాబు నాయుడు మాదిరిగా పనులు చేయాలంటే పార్టీ మారాలని చెప్పమన్నారు. తమ సర్పంచి ఆధ్వర్యంలోనే అభివృద్ధి పనులు జరుగుతాయని అందుకు సహకరించాలని తెలిపారు. వైస్ ఎంపిపిలు శ్రీరాములు, నాగమణి, ఎంపిడిఒ అల్లాబకాష్, డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- వైసిపి రాష్ట్ర యువజన నాయకులు ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైసిపి రాష్ట్ర యువజన నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కల్లుకుంట గ్రామంలో రెండోరోజూ 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. గ్రామంలో ప్రతి గడపకూ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి కుటుంబానికీ అందాయని తెలిపారు. అందని వారికి త్వరలోనే అందేటట్లు చూస్తామని హామీఇచ్చారు. నాయకులు రామ్మోహన్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిపి రఘురాం, సర్పంచి ఇస్మాయిల్, మాజీ సర్పంచి సత్యనారాయణ, బాలముని, డీలర్ నర్సింగప్ప, కటిక మహ్మద్, విజయ్ కుమార్, షేర్‌ఖాన్, అమీర్ ఖాన్ పాల్గొన్నారు.

అధికారులు గైర్హాజరు

- సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - హొళగుంద

అధికారుల హాజరుకాని సర్వసభ్య సమావేశాలు ఎందుకని సర్పంచులు, ఎంపిటిసిలు తదితర ప్రజాప్రతినిధులు శనివారం సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బి తదితర శాఖ అధికారులు ప్రతి సర్వసభ్య సమావేశానికీ హాజరు కాలేదని తెలిపారు. సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల్లేక పంటలన్నీ ఎండిపోతుంటే విద్యుత్ శాఖాధికారులు విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. రైతులు, వ్యాపారులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఢణాపురం, హొళగుంద రోడ్డు, మార్లమడికి రోడ్డు గుంతలమయమైందని, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆర్అండ్‌బి అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలోనూ తాగునీటి సమస్య నెలకొందని, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సకాలంలో పరిష్కరించలేకపోతున్నారని మండిపడ్డారు. భవిష్యత్తులో ఏ ఒక్క శాఖ నుంచి కూడా అధికారుల హాజరు కాకపోతే సమావేశాలు బాయ్‌కాట్ చేస్తామని హెచ్చరించారు. ఎంపిపి నూర్ జాన్‌బీ, ఎంపిడిఒ రాధా పాల్గొన్నారు.

బోరుకు మోటార్ వితరణ

ప్రజాశక్తి - ఆదోని

మురికివాడలోని ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్య పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని అంబేద్కర్ విగ్రహావిష్కరణ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షులు చిన్న తెలిపారు. శనివారం పట్టణంలోని న్యూ గాంధీనగర్‌లో అసంపూర్తిగా ఉన్న వాటర్ ట్యాంకుకు మరమ్మతులు చేపట్టి బోరుకు మోటారు అమర్చి కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్న మాట్లాడారు. పట్టణంలోని సయ్యద్ షా దర్గా, సంతపేట బాలుర స్కూల్ వద్ద ఉన్న ట్యాంకులకు గతంలో మోటార్లు అమర్చి నీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి సహకారం అందించామని తెలిపారు. సమాజ సేవలో తమ వంతు భాగస్వామ్యములు అవుతున్నామన్నారు. నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవడంతో స్థానికులు వారి సేవలను అభినందించారు. కమిటీ కార్యవర్గం హుస్సేని, ఏసు, నరసప్ప, హుస్సేని, నాగేంద్ర, పెయింటర్ వీరేష్ ఉన్నారు.

ఆదుకోనున్న రాంజల

- నీటిని బయటకు పంపే కార్యక్రమం షురు
- 1 నుంచి పంపింగ్ మొదలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణ ప్రజల దాహార్తి తీర్చే బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు కుంగిపోయింది. చెరువు మరమ్మతులు చేపట్టాలన్నా నెలల తరబడి సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. తుంగభద్ర దిగువ కాలువ నీటి ప్రవాహం తగ్గకముందే ట్యాంకును నీటితో నింపుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ట్యాంకు నీటితో నిండాలంటే 40 రోజుల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. స్టోరేజ్ ట్యాంకు వాలు కుంగిపోవడంతో నీటి పంపింగ్ ఆపేశారు. ప్రస్తుతం కాలువ నుంచే మోటార్ల ద్వారా నీటిని ఓవర్‌హెడ్ ట్యాంకుకు పంపింగ్ చేస్తున్నారు. విద్యుత్ అంతరాయం, సాంకేతిక కారణాలు ఏర్పడితే నీటి నిల్వ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు మరమ్మతులు రెండు దఫాలు చేసినప్పటికీ గోడ నిల్వలేక కుంగిపోయింది. సిమెంట్ లైనింగ్ పనులు నాణ్యత లోపం వల్లనే ఇలా జరిగిందని పలువురు పేర్కొంటున్నారు. మరమ్మతులు పూర్తయ్యలోపు కాలువలో నీటి ప్రవాహం తగ్గిపోతే పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడం



తలకు మించిన భారమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆదుకోనున్న రాంజల చెరువు

రాజుల కాలం నాటి రాంజల చెరువు ప్రస్తుతం ఆదోని ప్రజలను ఆదుకోనుంది. నీటిని నిల్వ చేసి అక్కడి నుంచి పట్టణవాసులకు సరఫరా చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం రాంజల చెరువులో నిల్వ ఉన్న నీటిని సరఫరా చేయరాదని, తాగడానికి పనికి రావని గతంలో సాంకేతికంగా, శాస్త్రీయంగా నిరూపణ అయింది. ఆ నీటిని తాగడం వల్ల డయేరియా వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు గతంలో తెలిపారు.

నీటిని బయటకు పంపే కార్యక్రమం షురు

ప్రస్తుతం రాంజల చెరువులో ఉన్న నీటిని బయటకు పంపేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. చెరువును అన్ని విధాలుగా శుభ్రం చేసి అక్కడ ఉన్న ఫిల్టర్ బెడ్‌లను శుభ్రం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 1 నుంచి ఎల్ఎల్‌సి నుంచి నీటి తోడేందుకు చర్యలు ముమ్మరం చేశారు.

1 నుంచి చెరువుకు నీటి పంపింగ్

- రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్



రాంజల చెరువును అన్ని విధాలుగా శుభ్రం చేసే పనులు మొదలయ్యాయి. సెప్టెంబర్ 1 నుంచి ఎల్ఎల్‌సి కాలువ నుంచి నీటిని చెరువుకు పంపింగ్ చేసేందుకు చర్యలు ముమ్మరం చేశాం. అక్కడి నుంచి పట్టణ ప్రజలకు నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తాగునీటి ఎద్దడి తప్పే అవకాశం ఉంది. ప్రజలు సహకరించాలి.

ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిటిడి పాలక మండలి సభ్యులుగా తమ సోదరుడు వై.సీతారామిరెడ్డిని నియమించినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. తమ కుటుంబం పట్ల నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు జగన్మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. టిటిడి బోర్డు సభ్యుల నియామకంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చోటు కల్పించి సామాజిక న్యాయాన్ని పాటించారని తెలిపారు.

సీతారామిరెడ్డి ఎంపిక పట్ల హర్షం

- పూజలు చేయించిన వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి

సీతారామిరెడ్డి రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న భీమిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాంపురం రెడ్డి సోదరుల్లో అగ్రజుడు వై.సీతారామిరెడ్డి టిటిడి పాలకమండలి సభ్యులుగా ఎంపిక కావడం హర్షణీయమని వైసిపి మండలాధ్యక్షులు జి.భీమిరెడ్డి తెలిపారు. రాంపురం రెడ్డి సోదరుల క్షేమాన్ని ఆకాంక్షిస్తూ శనివారం కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లాలోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి వారికి ఆకు పూజతో పాటు పంచామృతాభిషేకం, ఫల సమర్పణ వంటి విశేష పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాంపురం రెడ్డి సోదరులు మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో సీతారామిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తుంగభద్ర.. నాడు.. నేడు...



నీటి కళకళాడుతున్న తుంగభద్ర

నీరు లేక ఇసుక తేలిన తుంగభద్ర

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాకు వరప్రధాయినిగా ఉంటూ తుంగభద్ర నది సాగు, తాగునీరందించి ప్రజలకు, రైతులకు ఎంతో మేలు చేస్తోంది. ప్రతేడాది ఆగస్టు నెల వచ్చిందంటే తుంగభద్ర నది వరద నీటి పరవళ్లతో కనువిందు చేసేది. నదీతీర గ్రామాలన్నీ పచ్చదనంతో కొనసీమను తలపించేవి. కర్ణాటక ప్రాంతంలో వర్షాలు బాగా కురిస్తే తుంగభద్ర నది లక్ష క్యూసెక్కుల వరద నీటితో ఉగ్రరూపం దాల్చుతుంది. ఈ వరదలు వస్తే నదీతీరంలోని రైతులు విద్యుత్ మోటార్లను వేసి పంటలను కాపాడుకోవడానికి ప్రయత్నం చేసేవారు. గతేడాది తుంగభద్ర నిండుకుండలా ప్రవహించింది. నేడు తుంగభద్ర నది నీరు లేక వెలవెలబోతోంది. ఈ నది నీటిపై ఆధారపడిన రైతులు దిక్కులు చూస్తున్నారు. కళ్ల ముందు తమ పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. నదిలో ఇసుక తప్ప నీటి జాడే కనిపించడం లేదు. ఎడారిని తలపిస్తోంది. నాడు వరద నీటితో ఉధృతంగా ప్రవహించిన తుంగభద్ర నది నేడు నీరు లేక వెలవెబోతోంది.

'మారెమ్మ ఉత్సవాన్ని జయప్రదం చేయాలి'

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని న్యూ గాంధీనగర్‌లో వెలసిన మారెమ్మ దేవత మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ వీరేష్ కోరారు. శనివారం ఆలయ ఆవరణలో ఆయన మాట్లాడారు. ఈనెల 29న మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తుంగభద్ర నది నుంచి ప్రత్యేకంగా తెచ్చిన జలంతో మంగళవారం అమ్మవారికి అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, నైవేద్య సమర్పణ ఉంటుందని చెప్పారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహిస్తామన్నారు. 30 ఏళ్లుగా వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు ఆవుల సురేష్, గోపాల్, పరమేష్, కుమార్ స్వామి, గోపి, బసవ, ఉరుకుంద ఉన్నారు.

వైద్యరంగాభివృద్ధి పథంలో ఎమ్మిగనూరు

- ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వైద్యరంగ అభివృద్ధి పథంలో ఎమ్మిగనూరు దూసుకుపోతోందని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మునెప్ప నగర్‌లో శిల్పా నర్సింగ్ హోమ్ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఆయన కుమారుడుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ కెఎస్.రఘు, వీరశైవ లింగాయత్ ఛైర్మన్ వై.రుద్రగౌడ్, వైసిపి రాష్ట్ర యువజన నాయకులు ప్రదీప్ రెడ్డి, శిల్పా నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ శిల్పా, డాక్టర్ చంద్రకాంత్, నాయకులు శివశంకర్, విశ్రాంత డీఎస్పీ వేణుగోపాల్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్యంత ఆధునిక పరికరాలతో హాస్పిటల్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, ఎస్సీ శ్రీనివాసులు, జిల్లా వైద్య సిబ్బంది డాక్టర్ రామకృష్ణ నాయక్, టిడిపి నాయకులు కలీముల్లా, కొండయ్య చౌదరి, దయాసాగర్ పాల్గొన్నారు.

నర్సింగ్ హోమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎర్రకోట

హెడ్వార్డ్ రీడింగ్ క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించాలి

- సిపిఎం మండల కార్యదర్శి షాకీర్

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులోని హెడ్వార్డ్ రీడింగ్ క్లబ్‌కు ఎన్నికలు నిర్వహించాలని సిపిఎం మండల కార్యదర్శి షాకీర్ కోరారు. శనివారం ఆయన ఆలూరు జ్యోతిబసు భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సంస్థ హెడ్వార్డ్ రీడింగ్ క్లబ్ అని తెలిపారు. ఈ క్లబ్‌లో రాజకీయంగా ప్రజాప్రతినిధులే అధ్యక్ష, కార్యదర్శులుగా ఉంటూ ఎలాంటి ఎన్నికలూ నిర్వహించడం లేదని, వచ్చిన నిధులు ఏమవుతున్నాయో తెలియని పరిస్థితి ఉందని చెప్పారు. గతంలో వచ్చిన నిధులతో స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించడం, ప్రావీణ్యం కలిగిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం, వైద్య పరీక్షలు నిర్వహించేవారని తెలిపారు. సంస్థకు చెందిన వారు ఆడిటింగ్ నిర్వహించి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

తూతూమంత్రంగా సోషల్ ఆడిట్

- ఉపాధిలో వెలుగులోకి రాని అక్రమాలు
- రూ.8 కోట్లకు పైగా పనుల్లో రూ.17 వేలే అక్రమాలు

ప్రజాశక్తి - ఆస్పరి

మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన సోషల్ ఆడిట్ తూతూమంత్రంగా సాగింది. ఏడాది పాటు జరిగిన ఉపాధి పనుల ఆడిట్‌పై గంటలోపే సమావేశం ముగిసిందంటే ఎలా జరిగిందో అర్థం చేసుకోవచ్చు. డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి, అడిషనల్ పీడీ సలీం బాష, చంద్రశేఖర్, ఏపీడీ పకీరప్ప, ఎస్ఆర్‌పి మల్లికార్జున ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ చేపట్టారు. 2022-23 సంవత్సరాలకు సంబంధించి మండలంలో రూ.8.16 కోట్ల ఉపాధి పనులు జరిగాయి. ఈ పనులకు సంబంధించి ఆడిట్ సభ్యులు గ్రామాల్లో పనులను పరిశీలించి చారణ చేపట్టారు. ఈ నివేదికను సోషల్ ఆడిట్ ద్వారా బహిరంగ పరిచారు.

సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

ఆస్పరిలో ఆడిట్ జరుగుతుందన్న విషయం ప్రజలకు అవగాహన లేకో, గ్రామస్థాయిలో ఉపాధి సిబ్బంది తప్పులు బయట పడకుండా సరిచేసుకున్నారో ఏమోగాని ఎవరూ, ఎలాంటి అభ్యంతరాలూ వ్యక్తం చేయలేదు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పదుల సంఖ్యలోనే హాజరయ్యారు. జనం ఎవరూ రాకపోవడంతో అధికారులు ఏర్పాటు చేసిన కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఆడిట్‌లో రూ.8.16 కోట్లకు గాను రూ.17 వేల అక్రమాలు మాత్రమే వెలుగు చూశాయి. ఎంపిడిఒ రాణెమ్మ, ఎపిఒలు చక్రవర్తి, కృష్ణమోహన్, పిఆర్ ఎఇ యమునప్ప పాల్గొన్నారు.

అదనపు గదిని ప్రారంభిస్తున్న హరికృష్ణ, వెంకటలక్ష్మి

బీసీ బాలుర హాస్టల్ అదనపు గది ప్రారంభం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని చిన్నహోతూరు బీసీ బాలుర హాస్టల్‌లో నిర్మించిన అదనపు గదిని శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిని వెంకటలక్ష్మి, సర్పంచి హరికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీసీ బాలుర హాస్టల్‌లోని విద్యార్థులు గదుల్లేక ఇబ్బందులు పడుతుండేవారని తెలిపారు. వసతి గృహ సంక్షేమ అధికారి అనిమి రెడ్డి, సర్పంచి, వారి స్నేహితుల సహకారం అందించి రూ.4 లక్షలతో అదనపు గది, డైనింగ్ హాలు, పాత గదుల్లో ప్లాట్ ఫామ్ పనులు చేపట్టారు. వసతి గృహంలో తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, త్వరలోనే పైపులైన్ వేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని సర్పంచి హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచి హరికృష్ణకు శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. కులుమాల మాజీ ఎంపిటిసి దస్తగిరి, వైసిపి నాయకులు బసవరాజు, శివుడు, విశ్వనాథ్ రెడ్డి, మాదెప్ప, ప్రమీల, ఎర్రమ్మ, వెంకటసుబ్బయ్య, కోటీశ్వరయ్య, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి మహిళ మృతి

- మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని నయారా పెట్రోల్ బంకు సమీపంలో శనివారం ఆటో బోల్తా పడి మహిళ మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎమ్మిగనూరుకు చెందిన జోగి నాగేంద్రమ్మ (48) తాత్కాలికంగా రాళ్లదొడ్డిలో ఉంటున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్లాస్టిక్ వస్తువులు, స్టీలు సామగ్రి, గిన్నెలు లాంటివి అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఎమ్మిగనూరు నుంచి వస్తున్న గుడేకల్‌కు చెందిన ఓ వ్యక్తి ఆటోలో గోనెగండ్లకు రావడానికి బయల్దేరారు. గోనెగండ్లలోని నయారా పెట్రోల్ బంకు సమీపంలో ఆటో బోల్తా పడడంతో నాగేంద్రమ్మకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గోనెగండ్లలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ముద్దఛర్మాని'కి ముందస్తు టీకా...

- వ్యాధి నిరోధక శక్తి పెంపునకు కృషి
- పశుసంవర్ధక శాఖ ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పాడిపశువులకు ప్రాణాంతకంగా మారిన లంపీ స్కిన్ (ముద్దఛర్మం) వ్యాధికి ముకుతాడు వేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ముందస్తుగానే టీకాలు వేసి పాడిపశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంచుతోంది. ఇందుకోసం పశుసంవర్ధక శాఖాధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. ఇప్పటికే పశువులకు గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వ్యాధి టీకాలు ప్రభుత్వం అందజేస్తోంది. అలాగే గొర్రెలు, మేకలకు పారుడు రోగం, నీలి నాలుక వ్యాధికి టీకాలు అందజేసి సంరక్షిస్తోంది. తాజాగా ప్రాణాంతకమైన లంపీ స్కిన్ వ్యాధి నివారణకూ ఉచితంగా టీకాలు పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకూ జిల్లాలో వ్యాధి లక్షణాలు కనిపించకున్నా, ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వం టీకాలు వేసే కార్యక్రమం చేపట్టింది.

ప్రమాదకరమైన వ్యాధి

- పశువైద్యాధికారి వంశీ

ముద్దఛర్మ వ్యాధి ప్రమాదకరమైంది. ముద్దఛర్మ వ్యాధిని తొలిసారిగా 1992లో ఆఫ్రికా ఖండంలోని జాంబియాలో గుర్తించారు. 2019లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ ముద్దఛర్మ వ్యాధి కేసులు నమోదయ్యాయి. 2022లో జిల్లాలో సుమారు వంద పశువులు మృత్యువాత పడ్డాయి. ఆవులు, దూడలకు ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు ఛర్మంపై బుడిపెలు, దద్దుర్లు ఏర్పడతాయి. ఇది వైరస్ ద్వారా పాడిపశువులకు వ్యాపిస్తుంది. వైరస్ సోకిన పశువుల్లో 10 రోజుల్లోపు వ్యాధి లక్షణాలు బయటపడతాయి. 105 డిగ్రీల వరకూ జ్వరం వస్తుంది. ఛర్మం ముద్దగా మారుతుంది. పశువులు మేత, నీరు తీసుకోవడం మానేస్తాయి. కళ్లు, ముక్కు నుంచి నీళ్లు కారుతాయి. ముట్టెమీద, నోటి దూలం లోపల బుడిపెలు వస్తాయి. మెడ, తొడ దగ్గర లింఫ్ గ్రంథులు వాస్తాయి. పశువుల ఛర్మంపై బుడిపెలు ఏర్పడి వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే పశువులు మేత మేయక పాలు పూర్తిగా తగ్గిపోతాయి. ఛర్మంతో పాటు పొదుగు, బాహ్య జననేంద్రియాలపై దద్దుర్లు కనిపిస్తాయి. నొప్పి అధికంగా ఉండి పాలు పితకనియ్యవు. సకాలంలో వైద్యులను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. వ్యాధి సోకిన పశువుల్లో 1 నుంచి 5 శాతం వరకూ మృత్యువాత పడవచ్చు. ఒక గ్రామంలో అన్ని పశువులకూ వైరస్ సోకితే ప్రమాద స్థాయి పెరుగుతుంది.

టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి వంశీ

గ్రామాల్లో 80 శాతం టీకాలు వేశాం

ఇప్పటికే మండలంలోని చిన్న పెండేకల్, పెద్ద పెండేకల్, ఆరెకల్, నాగలాపురం, పెద్దహరివాణం, పెద్దతుంబలం, జాలమంచి, కుప్పగల్ తదితర గ్రామాల్లో 80 శాతం టీకాలు వేశాం. ఇప్పటికీ గ్రాములు మిగిలిన పశువులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా టీకాలను పంపిణీ చేస్తోంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

మానసిక ప్రశాంతతతో ఆరోగ్యం పదిలం

- జడ్‌పిటిసి విరుపాక్షి - శివాలయం కలశ స్థాపనకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - చిప్పగిరి

రోజూ చేసే పనుల వల్ల ఒత్తిడికి గురవుతుంటామని, ప్రశాంతంగా ఉంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పంచాయతీరాజ్ వింగ్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, జడ్‌పిటిసి విరుపాక్షి తెలిపారు. శనివారం దేవనకొండ మండలం కుంకునూరు గ్రామానికి చెందిన పెద్దలు ఎంపిటిసి లింగప్ప, రామాంజనేయులు, పరమేష్, మాధవ్, రామన్న గౌడ్, గోవిందు చిప్పగిరిలో జడ్‌పిటిసి విరుపాక్షి స్వగ్రామానికి వెళ్లి కలిశారు. గ్రామంలో శివాలయంలో కలశ స్థాపన నిర్వహిస్తున్నామని,ఆర్థిక సహాయం అందించాలని కోరారు. జడ్‌పిటిసి స్పందిస్తూ మంచి పనులు నిర్వహిస్తున్నప్పుడు తమ సహాయం ఎల్లవేళలా ఉంటుందని, పెద్దలకు రూ.10 వేలు అందజేశారు. పెద్దలు విరుపాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరయి నూతన వధూవరులను ఆశీర్వదించారు.



నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న జడ్‌పిటిసి విరుపాక్షి

ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడొద్దు

- టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవ రావు దేశాయి

ప్రజాశక్తి - నందవరం

తిమ్మారెడ్డి కుంటలోని బావి, బోరు నీటిని కలిపి వదలడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడొద్దని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, తాలూకా క్లస్టర్ ఇన్‌ఛార్జీ మాధవ రావు దేశాయి తెలిపారు. శనివారం ఆయన నందవరంలో తిమ్మారెడ్డి కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించకపోగా, దుర్వాసన వచ్చే తాగునీటిని సరఫరా చేయడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 20 నుంచి 30 రోజులకోసారి తాగునీటిలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని చెప్పారు. శుభ్రం చేయకుండా నీటిని సరఫరా చేయడంతో ఆ నీరు దుర్వాసన వస్తున్నాయన్నారు. బావినీటిని, బోరు నీటిని కలిపి వదలడంతో నీటి స్వచ్ఛతలో మార్పు వచ్చి తాగునీటికి పనికి రాకుండా పోతున్నాయని తెలిపారు. గ్రామంలోని కొన్ని కాలనీలకు బోర్లలోని ఉప్పు నీటిని సరఫరా చేయడంతో ప్రజలు ఆ నీటిని తాగలేకపోతున్నారని చెప్పారు. ప్రయివేట్ వ్యక్తుల దగ్గర, సుజల స్రవంతి పథకం దగ్గర ఒక్కో బిందె రూ.10 పెట్టి కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి స్వచ్ఛమైన తాగునీరందించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సంబంధిత అధికారులు, సర్పంచిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎంపిటిసి తిమ్మరాజు, తెలుగు ఈరన్న, వెంకటేష్, బసవ, మల్లికార్జున, వలీ పాల్గొన్నారు.

కోట్లను విమర్శించే స్థాయి రామయ్యకు లేదు

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

కోట్ల కుటుంబాన్ని విమర్శించే స్థాయి కర్నూలు మేయర్ బివై.రామయ్యకు లేదని టిడిపి మండల కన్వీనర్ అశోక్ యాదవ్, సర్పంచి మోహన్ రాజు తెలిపారు. శనివారం వారు మొలగవల్లిలో విలేకరులతో మాట్లాడారు. కర్నూలు జిల్లా అభివృద్ధికి ఆద్యులు కోట్ల కుటుంబమేనని, వాస్తవాలు తెలుసుకోవాలని తెలిపారు. కేవలం జగన్ మెప్పు కోసమే బివై.రామయ్య కోట్లపై విమర్శలు చేస్తున్నారని చెప్పారు. కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి దగ్గర రాజకీయ ఓనమాలు నేర్చుకుని నేడు తిన్నింటి వాసాలు లెక్క పెట్టే విధంగా మాట్లాడడం సరికాదని మండిపడ్డారు. వైసిపిలోనే రామయ్య దిక్కు లేదని, కర్నూలు నగర అభివృద్ధి పనుల్లో పర్సంటేజీల కోసం వైసిపి నేతలే దేహశుద్ధి చేసింది మరిచిపోయారా అని ఎద్దేవా చేశారు. జిల్లాలో శాశ్వత పనులకు శ్రీకారం చుట్టింది కోట్ల కుటుంబమేనని తెలిపారు. పదవుల కోసం పార్టీలు మారారని, తమ నాయకులు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణం, అండర్ గ్రౌండ్ పైపులైన్, పెండింగ్ ప్రాజెక్టుల కోసం రాజకీయ మార్పు కోరారని తెలిపారు. చేతనైతే పెండింగ్ ప్రాజెక్టుల పనులను పూర్తి చేయాలన్నారు. హుస్సేన్, చిలుక మాణిక్యం, మురళీ, శ్రీధర్, మస్తాన్, బంగి రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులోని కోట్ల క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. టిడిపి నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ జి.అల్తాఫ్, రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ మాచాని శివ కుమార్ మాట్లాడారు. జిల్లాకు నీళ్లు తీసుకు రావాలన్నా, నిధులు కేటాయించాలన్నా, నియామకాలు చేపట్టాలన్నా కోట్ల కుటుంబానికే సాధ్యమన్నారు. ఆత్మ మండల మాజీ ఛైర్మన్ కందనాతి శ్రీనివాసులు, టిడిపి ముస్లిం, మైనార్టీ పట్టణ నాయకులు కెఎమ్‌డి.అబ్దుల్ జబ్బార్, మండల నాయకులు మాసుమాన్‌దొడ్డి శ్రీనివాసులు, మల్కాపురం పురుషోత్తం రెడ్డి, పార్లపల్లి లక్ష్మన్న, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు కంపాడు చిన్న రంగన్న, మైనార్టీ నాయకులు గోరా బాష, మహబూబ్ బాషా, ఆఫ్గాన్ వలీబాష పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న నాయకులు

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO 431/2021

కర్నాటి బలరామి రెడ్డి ...వాది
వర్సస్
దార్ల ఫిలిప్ ఇస్మాయిల్ బాబు ...ప్రతివాది

To
ప్రతివాది చిరునామా
దార్ల ఫిలిప్ ఇస్మాయిల్ బాబు
తండ్రి జాన్ సుందర్ రావు,
వయస్సు 55సంవత్సరాలు, క్రిస్టియన్, వ్యాపారం,
చెన్నూరు గ్రామము, సిరివెళ్ల మండలము,
కర్నూలు జిల్లా.

పై నెంబర్ దావాలోని వాది మీ నుండి దావా ప్రాంసరీ నోటు బాకీ రాగోరి దావా దాఖలు చేసినందున కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం సదరు దావాలో మీరు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు 05-09-2023 వ తేదీ వాయిదా వున్నది. మీరు వాయిదా రోజు ఉదయం గం. 10:30 ని.లకు పై కోర్టు నందు మీరు స్వయంగా గాని, లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ 22-08-2023

ఇట్లు
శ్రీ తురగా ఈశ్వర అంజనీకుమార్
శ్రీ బి.డి గిరి.
వాది పరం అడ్వకేట్స్,
గిద్దలూరు.